క్లుప్తంగా

ప్రత్యేక పూజలు



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు.

నేడు విద్యుత్ నిలిపివేత

గన్నవరం: స్థానిక రైల్వే స్టేషన్‌లో మూడో ట్రాక్ లైన్ పనులు కారణంగా వీరపనేనిగూడెం సబ్‌స్టేషన్‌కు వెళ్లే 33/11కేవీ విద్యుత్ సరఫరాను మంగళవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు నిలిపివేయనున్నట్లు గుణదల కార్యనిర్వహణ ఇంజినీర్ పి.హరిబాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా బీబీ.గూడెం, గొల్లనపల్లి, గోపవరపుగూడెం, చిక్కవరం, కొత్తగూడెం, వీరపనేనిగూడెం, మెట్లపల్లి, తెంపల్లి, బల్లిపర్రు గ్రామాలకు పైన తెలిపిన సమయాల్లో విద్యుత్ సరఫరా ఉండబోదని పేర్కొన్నారు. ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

చెరువుకు ఫెన్సింగ్

అంబాపుర్ర(విజయవాడరూరల్): అంబాపురం గ్రామంలోని యల్లాపు చెరువును సంరక్షించుకోవడంలో భాగంగా ఫెన్సింగ్ నిర్మించినట్టు మాజీ ఎంపీపీ తోడేటి రూబేస్ తెలిపారు. రెవెన్యూ రికార్డు ప్రకారం చెరువు విస్తీర్ణం 11.89 ఎకరాలు ఉండేదని, ఇప్పటికే చెరువులో పలు ఆక్రమణలున్నాయని పేర్కొన్నారు. గ్రామస్తులకు తాగునీరు సదుపాయం కోసం కొంత భాగం ఫెన్సింగ్ నిర్మించినట్లు తెలిపారు. గొల్లపూడి పంపింగ్ స్కీమ్ నుంచి వచ్చే నీటితో చెరువును నింపే విధంగా సంబంధిత అధికారులతో మాట్లాడనున్నట్టు పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు చెరువు ఆక్రమణలకు గురికాకుండా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ సిబ్బంది ఫెన్సింగ్ నిర్మించిన ప్రాంతాన్ని పరిశీలించి, ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించారు.

దాడిపై కేసు నమోదు

పెనమలూరు: మండల కేంద్రంలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన జి.రాజు తన భార్యతో తగాదాపడుతుంటే పక్కింట్లో ఉండే ప్రదీప్ గొడవను నివారించే యత్నం చేశాడు. వివాదం ముదరటంతో రాజు పై కర్రతో ప్రదీప్ దాడి చేశాడు. ఈ ఘటన పై రాజు సోదరుడు సురేష్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

వరకట్నం వేధింపులపై....

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటివారి పై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. తాడిగడప వసంతనగర్‌కు చెందిన ఎండి.రజియాబేగం గత ఏడాది మేడూరుకు చెందిన సైదుల్లాబేగ్‌ను వివాహం చేసుకుంది. పెళ్లి సమయంలో కట్నకానుకలు ఇచ్చారు. అయితే అదనపుకట్నం కోసం భర్తతో పాటు అత్త సిరాజున్నీసా వేధించ సాగటంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది.

విద్యార్థిని అదృశ్యం

పెనమలూరు:తల్లిదండ్రులు మందలించారని పెనమలూరులో విద్యార్థి అదృశ్యం అవ్వటంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. చెంచులకాలనీకి చెందిన మొగిలి శివ పార్వతీ కుమార్తె (17) విజయవాడలో ఇంటర్ చదువుతుంది. ఆమె పరీక్షలకు సరిగా చదవటం లేదని తల్లిదండ్రులు మందలించారు. దీంతో ఆమె ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

నలుగురు అరెస్టు

హనుమాన్‌జంక్షన్ రూరల్: చట్టవిరుద్ధంగా జూదశిబిరాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని వీరవల్లి ఎస్సై ఎం.చిరంజీవి హెచ్చరించారు. బాపులపాడు మండలం తిప్పనగుంటలో కోడి పందేల శిబిరంపై దాడి నిర్వహించారు. నాలుగు కోడిపుంజులు, నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకోవడంతో పాటు గా వారి నుంచి రూ.8,500, రెండు కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నారు.

విత్తనాలు అందజేత

గన్నవరం రూరల్: నవధాన్యాలు సాగుచేసి భూమిలో రైతులు పోషక విలువలు పెంచాలని వీరపనేనిగూడెం సర్పంచ్ ఆరేపల్లి జేజమ్మ పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయం అధికారుల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్‌బీకే వద్ద రైతులు పంట భూముల్లో ఈ సమయంలో సాగు చేయాల్సిన 32రకాల నవధాన్యాలతో కూడిన ధాన్యం, నూనె, పచ్చిరొట్ట తదితర విత్తనాలను ప్రదర్శించి వాటిని విత్తన గుళికలుగా తయారు చేసి రైతులకు అందజేశారు. వీఏఏ బి.సంధ్య, వీఏఏ డి.మంజువాణి, ఐసీఆర్‌పీ జె.వెంకమ్మ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నున్న(విజయవాడరూరల్): నాయీబ్రాహ్మణ నున్న కమిటీ నూతన కార్యవర్గం సభ్యులకు రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ద్రాక్షారపు సూరిబాబు నియమాక పత్రాలను అందచేశారు. నున్న గ్రామ కమిటీ అధ్యక్షుడు కోడూరు కృష్ణ, ప్రధాన కార్యదర్శి మునుగోటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు దొడ్డి చింతల కుమార్, సహాయ కార్యదర్శి అవనిగడ్డ ప్రసాద్, కోశాధికారి కోడూరు భానుప్రసాద్, గౌరవాధ్యక్షుడు మేడూరు వెంకటేశ్వరావు, 15 మంది సభ్యులతో కమిటీ ఏర్పడింది.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్

గన్నవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి సమాన ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ పేర్కొన్నారు. గన్నవరంలో రూ.62 లక్షలతో నిర్మించిన రహదారులను సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. తొలుత కోనాయి చెరువు వద్ద ఎస్టీ కాలనీలో జిల్లా పరిషత్ నిధులు రూ.25 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, సీసీ డ్రెయిన్‌ను ప్రారంభించారు. అనంతరం స్థానిక రాయ్‌నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా కేటాయించిన రూ. 20 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ.17 లక్షలతో నిర్మించిన బీటీ ప్రధాన రహదారులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం పూర్తిచేసిన సచివాలయాల పరిధిలో అభివృద్ధికి రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అంతే కాకుండా అంతర్గత రహదారుల అభివృద్ధికి జిల్లా పరిషత్, మండల పరిషత్ ద్వారా నిధులు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు ఇంతగా మేలు చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అందరూ మద్దతుగా నిలవాలని కోరారు. ఏఎంసీ చైర్మన్ రామిశెట్టి అంజనీకుమారి, ఎంపీపీ అనగాని రవి, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ. గౌసాని, వైస్ ఎంపీపీలు కొమ్మరాజు సుధీర్, కాలగడ్డ శివ నాగరాజకుమారి, సర్పంచ్ నిడమర్తి సౌజన్య, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ మన్నె సుందరరావు పాల్గొన్నారు.



ఎస్టీ కాలనీలో సీసీ రోడ్డు ప్రారంభోత్సవ శిలఫలాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వంశీ

ఎల్ఈడీ లైట్లు ప్రారంభం

స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలోని వాకర్స్ సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఎల్ఈడీ లైట్లను ఎమ్మెల్యే వంశీమోహన్ ప్రారంభించారు. క్రీడా మైదానంలో వాకింగ్ ట్రాక్ అభివృద్ధి చేయడంతో పాటు మంచి సదుపాయాలు కల్పిస్తున్న వాకర్స్ అసోసియేషన్‌ను ఆయన అభినందించారు. అసోసియేషన్ అధ్యక్షుడు మదుపల్లి బాలకృష్ణమూర్తి, వాకర్స్ ముక్కామల సుబ్బారావు, కేఎస్ బాబూరావు, వీసం ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సంక్షేమ పాలనతో భరోసా

- ఆర్థిక బాధల నుంచి విముక్తి
- గడప గడపలో ప్రజల అభిప్రాయం

పెనమలూరు:జగనన్న సంక్షేమ పాలనలో భరోసాగా ఉన్నామని, ఆర్థిక బాధల నుంచి విముక్తి కలిగిందని షేక్.కరీమున్నీసా, మంచాల విజయ తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి సోమవారం తాడిగడప వసంతనగర్ కాలువ కట్ట పై విస్తృతంగా పర్యటించారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్ లబ్ధిదారులకు అందచేశారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం అందించని సంక్షేమ పథకాలు జగనన్న తమకు అందిస్తున్నారన్నారు. ప్రభుత్వం ప్రకటించిన తేదీలకే సంక్షేమ పథకాల సొమ్ము నేరుగా తమ బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని ఆనందం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో పేదలు భరోసాగా జీవించాలని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మొదటిసారిగా దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో జగనన్న సంక్షేమ పాలన అందిస్తున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా ఉండాలంటే జగనన్న పాలన తప్పనిసరన్నారు. ప్రతిపక్షాల అసత్య ప్రచారాన్ని ప్రతి ఒక్కరూ తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కంకిపాడు జెడ్పీటీసీ సభ్యుడు బాకీబాబు, స్థానిక నేతలు కటికల క్రిష్టోఫర్, ఎస్.కిషోర్, తుమ్మల వరదీష్, వేమూరి బాలకృష్ణ, అంగిరేకుల సీతారామయ్య, ఖాదర్‌బాషా, వెలిశిల ప్రసాద్, పలువురు పాల్గొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే పార్థసారథి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



పథకాల అమలుపై లబ్ధిదారులకు వివరిస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

మునిసిపల్ బడ్జెట్ రూ.26.43 కోట్లు

- ఆమోదం తెలిపిన మున్సిపల్ కౌన్సిల్
- ఆశీలు పాట రద్దు
- తాగునీరు, పారిశుద్ధ్యంకు ప్రాధాన్యం
- ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

ఉయ్యూరు: మునిసిపల్ బడ్జెట్‌కు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోద ముద్ర వేసింది. తాగునీరు, పారిశుద్ధ్యానికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తూ రూ.26.43 కోట్లకు బడ్జెట్ ఆమోదం తెలిపింది. కౌన్సిల్ హాల్లో చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) అధ్యక్షతన 2023–24 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ సమావేశం, అత్యవసర సమావేశం సోమవారం నిర్వహించారు. రూ.26.43 కోట్లతో మున్సిపల్ బడ్జెట్ రూపొందించారు. రూ 26.08 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు. గెజిట్ నోటిఫికేషన్ లేకుండా పాత విధానంలో నిర్వహించిన ఆశీలు వేలంపాటను కౌన్సిల్ రద్దు చేసింది. గెజిట్ నోటిఫికేషన్‌పై డీఎంఏకు లేఖరాసి ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు ఆశీలు నిర్వహించాలని ఎమ్మెల్యే పార్థసారథి చేసిన సూచనలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. సమావేశానికి ప్రత్యేక అతిథిగా ఎమ్మెల్యే పార్థసారథి హాజరై బడ్జెట్‌లో పేర్కొన్న అంశాలపై శాఖల వారీగా సమీక్షించారు. వేసవి దృష్ట్యా తాగునీరు, పారిశుద్ధ్యానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పట్టణ వాసులకు తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టనున్న కార్యక్రమాలను వివరించారు. కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్‌లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసా బేగం, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



కౌన్సిల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

రంజాన్ క్యాలెండర్ ఆవిష్కరణ



పెనమలూరు:రంజాన్ పండుగకు సంబంధించిన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి సోమవారం కార్యాలయంలో ఆవిష్కరించారు. మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు అబ్దుల్‌గని సహకారంతో రంజాన్ ఇఫ్తార్, సహరి వేళలు తెలియచేసే విధంగా క్యాలెండర్ రూపొందించారు. మండల పరిధిలో ఉన్న అన్ని మసీదులకు ఈ క్యాలెండర్‌లు పంపిణీ చేస్తామని గని చెప్పారు. అన్వర్‌బాషా, వైత్రాయి పలువురు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న మగ్గం శిక్షణ

కంకిపాడు: బ్యాంకర్ల గ్రామీణ మరియు ఔత్సాహికుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సత్యసాయి సేవా సంస్థల సహకారంతో ప్రొద్దుటూరు గాయత్రీవిహార్‌లో నిర్వహిస్తున్న మగ్గం, జర్దోసి శిక్షణ కార్యక్రమం ఈ నెల 28వ తేదీతో ముగుస్తున్నట్లు శ్రీసత్యసాయి స్కిల్ డెవలెప్‌మెంట్ ప్రోగ్రాం రాష్ట్ర ఇన్‌చార్జి కె.నాగప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. జిల్లా నలుమూలల నుంచి 40 మంది మహిళలు, యువతులు మగ్గం, జర్దోసి శిక్షణ పొందారన్నారు. శిక్షణ ముగింపు ఉత్సవాలను గాయత్రీ విహార్‌లోని కమ్యూనిటీహాల్లో నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యఅతిథిగా సంస్థ డైరెక్టర్ డి.నాగరాజకుమార్, సత్యసాయి సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

నేడు ఆసరా సంబరాలు

కంకిపాడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్సార్ ఆసరా పథకం సంబరాలను మంగళవారం మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ దుర్గాప్రసాద్ తెలిపారు. విలేకర్లతో సోమవారం ఆయన మాట్లాడారు. ఈ నెల 25న ప్రభుత్వం మూడో విడత వైఎస్సార్ ఆసరా సొమ్మును విడుదల చేసిందన్నారు. తొలి విడతగా కంకిపాడు మండలంలోని 1206 స్వయం సహాయక సంఘాల్లోని 12166 మంది సభ్యులకు రూ.11.27 కోట్లు, రెండో విడతగా 1209 సంఘాల్లోని 11751 మంది సభ్యులకు రూ.11.32 కోట్లు లబ్ధిదారులకు జమ చేసిందన్నారు. మూడో విడతగా 1209 సంఘాల్లోని 11751 మంది సభ్యులకు రూ 11.29 కోట్లు విడుదల చేసిందన్నారు. మూడు విడతలతో కలిపి డ్వాక్రా మహిళలకు రూ.33.88 కోట్లు లబ్ధి చేకూరినట్లయిందన్నారు. ఆసరా మూడో విడత సంబరాలకు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి హాజరవుతారన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

జయప్రదం చేయాలి

గన్నవరం: బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు బడుగు మరియదాసు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం మండలంలోని బుద్ధవరంలో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు అన్యాయం జరుగుతోందన్నారు.

ప్రాధాన్యత క్రమంలో వసతుల కల్పన

కంకిపాడు:ప్రాధాన్యతా క్రమంలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు అన్నారు. జిల్లా పరిషత్ నిధులు రూ.50 లక్షలు అంచనా వ్యయంతో చేపట్టిన కంకిపాడు లాకురోడ్డు అభివృద్ధి పనులను బాబు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ సెంటరు నుంచి లాకులు వంతెన వరకూ ఉన్న రోడ్డు మార్గం పూర్తిగా ధ్వంసమై రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. గత ప్రభుత్వం రోడ్డు అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోడ్డు అభివృద్ధి అంశాన్ని ప్రాధాన్యంగా గుర్తించి అభివృద్ధికి అవసరమైన నిధులను సాధించుకున్నామన్నారు. రూ.50 లక్షలతో రోడ్డు అభివృద్ధి చేపట్టారన్నారు. మండలం వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించి గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. పరిశీలనలో సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ మేదండ్రావు కుటుంబరావు, జగన్నాధపురం సర్పంచ్ పిన్నబోయిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, ఇతర నేతలు

మహిళల సంక్షేమానికి, భద్రతకు పెద్దపీట

గన్నవరం: మహిళల అభివృద్ధికి, సంక్షేమానికి, భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని ఎంపీపీ అనగాని రవి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం వైఎస్సార్ ఆసరా మూడో విడత కింద మండలంలోని 1,604 డ్వాక్రా గ్రూపులకు మంజూరైన రూ.15.20 కోట్ల చెక్కును ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన ప్రతిఒక్క వాగ్దానాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆచరణలో అమలు చేస్తోందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రం అన్ని రంగాల్లో మహిళలకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. మహిళలకు ఇంతగా మేలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మహిళలందరూ మద్దతుగా నిలవాలని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ. గౌసాని కోరారు. వైస్ ఎంపీపీలు కొమ్మరాజు సుధీర్, కాలగడ్డ శివనాగరాజకుమారి, నాయీబ్రహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మల్కాపురం కనకరావు, ఎంపీడీఓ కె. వెంకటేశ్వరరావు, వైఎస్సార్ క్రాంతి పథం ఏరియా కోఆర్డినేటర్ రంగారావు, ఏపీఎం బండ్ల మాధవీ, మండల సమాఖ్య అధ్యక్షురాలు దేవరపల్లి సుశీల పాల్గొన్నారు.



డ్వాక్రా గ్రూపులకు చెక్కును అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

నేడు వైఎస్సార్ ఆసరా సంబరాలు

ఉంగుటూరు: ఉంగుటూరులో జెడ్పీ హైస్కూల్ ఆవరణలో మండల స్థాయిలో వైఎస్సార్ ఆసరా మూడోవిడత సంబరాలు మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జీఎస్వీ శేషగిరిరావు తెలిపారు. మండలంలో 1080 డ్వాక్రా గ్రూపులలోని 10,817 మంది లబ్ధిదారులకు రూ.10,03,1977 వారి వ్యక్తిగత ఖాతాల్లో జమ అయ్యాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆసరా సంబరాలు మంగళవారం ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే వంశీమోహన్ పాల్గొంటారని తెలిపారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలో ఉషారామ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సర్పంచ్ అనిత ప్రారంభించారు. మాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆస్పత్రికి చెందిన వైద్య సిబ్బంది శిబిరంలో 224 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు కోడెబోయిన బాబి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీహరిబాబు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్ష పత్రాలు రాక

హనుమాన్‌జంక్షన్ రూరల్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల ప్రశ్నపత్రాలు జిల్లా కేంద్రం నుంచి స్థానిక పోలీస్‌స్టేషన్లకు చేరుకున్నాయి. వచ్చే నెల మూడో తేదీ నుంచి టెన్త్ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో బాపులపాడు మండలంలో ప్రభుత్వం ఎనిమిది పరీక్ష కేంద్రాలను ఇప్పటికే ప్రకటించింది. దీంతో ఆయా పరీక్షా కేంద్రాలకు సంబంధించిన ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్ షీట్లు, జవాబు పత్రాలను పోలీస్‌స్టేషన్లకు తరలించారు. మచిలీపట్నం నుంచి సోమవారం ప్రత్యేక వాహనంలో ఇక్కడి హనుమాన్‌జంక్షన్, వీరవల్లి పోలీస్‌స్టేషన్లకు చేరుకున్నాయి. ఎంఈఓ సక్సేనారాజు, ఆయా కేంద్రాల అధికారులు వాటిని స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్లలో భద్రపర్చారు.

పర్యావరణాన్ని కాపాడదాం

నున్న(విజయవాడరూరల్): ప్లాస్టిక్ సంచులకు బదులుగా జూట్ సంచులను వాడుదామని సోమవారం నున్న గ్రామంలో రేడియంట్ హైస్కూల్ విద్యార్థులు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని గ్రామ పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణ జెండా ఊపి ప్రారంభించారు. వీసీఎస్ అండ్ టీపీ గవర్నింగ్ బాడీ మెంబర్ ఆరుమళ్ల మోహన్‌రెడ్డి, హైస్కూల్ ప్రిన్సిపాల్ మధుసూదనరెడ్డి, కరస్పాండెంట్ అనురాధ పాల్గొన్నారు.

వయ్యారిభామ మొక్క నిర్మూలనపై సమావేశం

విజయవాడరూరల్: జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం 10.30 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో వయ్యారిభామ కలుపు మొక్క నిర్మూలన పై సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బి.భార్గవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ సభ్యుడు కె.సువర్ణరాజు, వ్యవసాయాధికారి, హార్టీ కల్చర్, వెటర్నరీ అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు.

క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన

పెనమలూరు:క్యాన్సర్ పై ప్రజలకు ఎన్ఎస్ఎస్ విద్యార్థులు అవగాహన కల్పించారు. పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సోమవారం కానూరు గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి క్యాన్సర్ వ్యాధి పై గ్రామస్తులకు వివరించారు. అధిక బరువు, విపరీతంగా మద్యం సేవించటం, ధూమపానం తదితర చెడు అలవాట్ల కారణంగా క్యాన్సర్ వస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతమైన జీవితం గడపాలని, వ్యాయామం చేయాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్యామ్, అమెరికన్ ఆంకాలజీ మేనేజర్ ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.



కానూరులో క్యాన్సర్ పై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

వైఎస్సార్ సీపీలో అన్ని వర్గాలకు ప్రాధాన్యం

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు:వైఎస్సార్ సీపీలో అన్ని వర్గాల వారికి తగిన ప్రాధాన్యం ఉంటుందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. పార్టీ కృష్ణా జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడిగా గుమ్మడి విజయ్‌కుమార్‌ను నియమించిన సందర్భంగా హైస్కూల్ వద్ద ఆదివారం రాత్రి నిర్వహించిన సమావేశంలో పార్థసారథి పాల్గొని ప్రసంగించారు. వైఎస్సార్ సీపీలో ప్రతి ఒక్కరికీ తగిన న్యాయం చేకూరుతుందని పేర్కొన్నారు. జగనన్న నాయకత్వంలో పార్టీ బలోపేతానికి నేతలు తమ వంతు కృషి చేయాలని సూచించారు. ప్రజల సమస్యలు గుర్తించి పరిష్కరించే విధంగా చూడాలన్నారు. పార్టీ నాయకులు ప్రజల్లోనే ఉండి సేవలు అందించాలని అన్నారు. ఈ సందర్భంగా డొంక రోడ్డు మసీదు సెంటర్ నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జోడెడ్లబండి పై ఎమ్మెల్యే ఊరేగింపుగా వెళ్లి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జగనన్న చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. గుమ్మడి విజయ్‌కుమార్‌ను సత్కరించారు. గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ ఈడే చాముండేశ్వరి, పార్టీ నేతలు అన్నే వేణుగోపాలకృష్ణమూర్తి, కర్రా ఆదిశేషారావు, మరీదు శ్రీనివాసరావు,ఈడే గోపాలకృష్ణ, పలువురు పాల్గొన్నారు.



యనమలకుదురు కార్యక్రమంలో ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

శివాలయంలో గోశాల ప్రారంభం



గోశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఉయ్యూరు: గో సంరక్షణను అందరూ బాధ్యతగా తీసుకోవాలని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. పట్టణంలోని జగదాంబ సమేత సోమేశ్వర స్వామి దేవస్థానంలో ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ జంపాన కొండలరావు తన సొంత నిధులతో తన మనవడు జంపాన శ్రీరామ్ పేరుతో నిర్మించిన గోశాలను సోమవారం ఎమ్మెల్యే పార్థసారథి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గోమాతను పూజించాలని, ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ వల్లభనేని వెంకటేశ్వరరావు, శివాలయం చైర్మన్ సిహెచ్ కుటుంబరాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ సోలే సురేష్‌బాబు, ఆలయ ఈఓ కానూరి సురేష్‌బాబు, ధర్మకర్తల మండలి సభ్యులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూపీఎస్ షెడ్‌ను సందర్శించిన డీపీఓ

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం నిడమానూరులోని ఎస్‌డబ్ల్యూపీఎస్ షెడ్‌ను జిల్లా పంచాయతీ అధికారి జె.సునీత సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా దీని నిర్వహణ తీరు, సంరక్షణ అమలుపై పంచాయతీ కార్యదర్శి ప్రకాష్‌నాథ్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ షెడ్లలో నాడెప్‌లను కట్టించాలని సూచించారు. వానపాముల ఎరువులను తయారీ చేసి రైతులకు అందించాలని సూచించారు. ప్రకాష్‌నాథ్ మాట్లాడుతూ ఇప్పటి వరకు సుమారు 500 కేజీల వర్మీకంపోస్టు ఎరువును తయారు చేసినట్లు తెలిపారు. ఈ ఎరువును రైతులకు కూడా అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ చంద్రశేఖర్, ఎనికేపాడు పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.



పంచాయతీ అధికారులకు సూచనలిస్తున్న డీపీఓ సునీత

పోషకాహారంతో రక్త హీనత నివారణ



విద్యార్థినులకు పోషణ పక్వాడా పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెనమలూరు:రక్తహీనత లేకుండా ఉండే విధంగా ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.రమానాగమణి అన్నారు. గంగూరు, వణుకూరు గ్రామాల్లో సోమవారం పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా రక్తహీనతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రక్తహీనత రాకుండా చిరుధాన్యాలు, ఆకుకూరలు ఆహారంగా తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం సరఫరా చేస్తుందన్నారు. తల్లులు, గర్భిణులు, చిన్నారులు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని కోరారు. పాఠశాల హెచ్ఎం బీపీఎల్.పద్మలత, టీచర్లు వినోదిని, విజయలక్ష్మి, ఈవో సుబ్బారావు, శశాంక్, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

పాడిరైతు కుటుంబానికి క్షీరబంధు అందజేత

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పాడిరైతు కుటుంబానికి కృష్ణామిల్క్ యూనియన్ అండగా నిలబడింది. బాపులపాడు మండలం వీరవల్లి శివారు గ్రామమైన నారాయణపురానికి చెందిన తంబళ్ల సుబ్బరావు ఇటీవల మరణించడంతో కృష్ణామిల్క్ యూనియన్ అమలు చేస్తున్న క్షీరబంధు పథకం కింద రూ.50 వేలు సాయాన్ని ఆయన కుటుంబానికి సోమవారం అందజేశారు. వీరవల్లి పాల సొసైటీ అధ్యక్షుడు కసుకుర్తి నిరంజనరావు, సభ్యులు కోడెబోయిన బాబి, అరవపల్లి సీతారామయ్య, సూపర్‌వైజర్ గోపాల్‌లు మృతుడి కటుంబాన్ని పరామర్శించి, ఈ మొత్తాన్ని అందించారు.